# భార్య

గుడిపాటి వెంకటాచలం బి,ఏ,యల్,టీ;

రుక్మిణికీ నాకూ చిన్నప్పటినించీ స్నేహం. యిద్దరం ఒక బళ్లోనే చదువుకున్నాము. మాయిళ్లుదగ్గిరే. మాలో అంతఅల్లరిపిల్ల యింకెవరూ లేరు. రుక్మిణివొస్తోందంటే, మొగపిల్లలుకూడా భయపడేవాళ్లు. మా ఆడపిల్లలం రుక్మిణిఅంటే ప్రాణమిచ్చేసేవాళ్ళం. ఆఅమ్మాయి లేకుండా, ఒకఆట, పాట, నోము, పండగ, యేమీజరగదు; అసలు జరిగినట్టే వుండేదికాదు, యెన్నికొత్తఆటలుకల్పించేది! యెన్నికొత్త పాటలుపాడేది! అట్లతద్దివచ్చిందంటే, మమ్మల్ని రెండింటికే లేపేది. యింక మాగోలతో వూరంతాలేచేది. వుయ్యాల శివంపట్టినట్టువూకటే వూగడం. చెట్టుకొమ్మల్లోమాయమై రివ్వునకిందికిదిగేది, రుక్మిణి వుయ్యాల. యింకాచంటిపిల్లలు రుక్మిణిపేరువింటే తల్లులచేతుల్లో నిలవకుండా దూకేవాళ్ళు. సముద్రం పొంగినట్లుపొంగేవారు, ఆ అమ్మాయి మొహంమాత్రంతోటే గలగలమని నవ్వుతో రుక్మిణి వాళ్లనొక్కసారిమొగ్గేసి పట్టుకుందంటే, వాళ్ళవాళ్ళుపరవశమయ్యేది. "నన్ను, నన్ను, అన్ను,, అంటూయిరవైమంది కాళ్ళచుట్టూ మూగేవారు, "రుక్మిణివొచ్చియెత్తుకుంటుందిలే, రేపుప్రొద్దున్నే,, అనివోదార్చేవాళ్లు తల్లులు రాత్రియేడ్చేపిల్లల్ని. పువ్వులూ రంగుపీలికలూకట్టి, ఆపిల్లల్ని తయారుచేసేది. యెంతో అందంగావుండేవాళ్ళు. తలంటి పోసింతరువాత యెంతపెంకెపిల్లలయినా, రుక్మిణితలచిక్కుతీస్తూంటే, ఒక్కసారన్నా యేడవరు, పెద్దవాళ్లకి చిన్నవాళ్లకి, ముసలివాళ్లకి, అందరికీ రుక్మిణిఅంటేఅమితమైనప్రేమ. "రుక్మిణీ! ఒక్కసారియిట్లాకూచో" అని వాళ్ళచిన్నతనంకబుర్లన్నీ ఆ అమ్మాయికిచెప్పేవాళ్ళు ముసలమ్మలు. సృష్టిలో, దయా, మృదుత్వమూ, సంతోషమూ, నవ్వూ, కలిసి ఆపిల్ల అయిందేమో అనిపించేది.

ఇంక తెలివో, యేపుస్తకమన్నా చదివి జ్ఞాపకముంచుకుంటుంది. మళ్లీ తను మూడోక్లాసు చదివేదా, వాళ్లింటో ఫస్టుఫారం చదివే వారం కుర్రవాడికి లెక్కలు చేసిపెట్టేది. ఒకవారం ఆకుర్రవాడిదగ్గర, యింగ్లీషు అక్షరాలు నేర్చుకుంది-వెంటనే పేర్లు చదివేసేది. పాటలు, మంగళహారతులు, హాయిహాయి, యెట్లాపాడేది! ఆ అమ్మాయిగొంతుకలో యేముండేదో, యేపిచ్చిపాట పాడినా, గొప్ప సంగీతం లాగుండేది. తోవన పొయ్యేవాళ్ళు సహితం, ఆశ్చర్యంతో ఆగి వినేవాళ్ళు-కుట్లుమాత్రం రుక్మిణి కిష్టంలేదు. ఎన్నిసార్లో తంటాలు పడ్డది. కాని ఆవేళ్లకి ఒక్క మెలిక తిప్పడమన్నా చాతకాలేదు. రుక్మిణికి భయమన్నమాటలేదు. అర్థరాత్రయినా యెక్కడికంటె అక్కడికెళుతుంది. యెవరినిచూసినాభయములేదు. ఒకసారి రుక్మిణి మేనత్తకొడుకు పోలీసుయిన్‌స్పెక్టరు.అతన్ని చెంపకాయకొట్టింది, యేదోకోపమొచ్చి. ఎవరిసంగతన్నా సరిగ్గా లేదని తోచిందంటే వారూ,వీరని లేదు. యెంత మాటంటే అంతమాట అనేస్తుంది. మొహమాటం యేమిలేదు. "యేమండీ మీకోడల్ని అట్లా బాధపెటతారేం? మికేంజాలిలేదూ. మనుషులేనా" అంటుంది ఒకర్ని "యీడబ్బంతాకట్టి కెడతారా, ఒక్క దమ్మిడీ ఖర్చుచెయ్యరేం! "అంటుంది యింకోర్ని. ఒకరింటో మొగుడుపెట్టేబాధ పడలేక భార్య బావిలోపడి చచ్చిపోయింది. రుక్మిణి ఆయనదగ్గిరికివెళ్లి ఆమెనుచంపిందిమీరే. భార్య గనక యెవరూ ఏమీ అనరు. ఇంకొకర్నయితే యీపాటికి మిమ్మన్ని వురితీసేవారే" అంది. ఆయనమళ్ళీ పెళ్ళిచేసుకోవాలని చూశాడు. రుక్మిణి ఆ వూరంతా చెప్పింది ఆయనకి పిల్లనివ్వవొద్దని. బయట వూరినించి యెదోసంబంధమొస్తే వాళ్లతోకూడా పనిబట్టి "మీపిల్లని చంపుతాడు ఇయ్యకండి" అని బతిమాలివొచ్చింది. అట్లాంటిది రుక్మిణి.

రుక్మిణి అందమయినపిల్ల. కొంచెంపొట్టి, లావు. నాకంటేరెండేళ్ళు చిన్నది, కాని నాకంటె పెద్దదిలాగుండేది. అందరికీ ఆ అమ్మాయిమొ

హం చూస్తే ముద్దు. కాని మొగాళ్లు ముట్టుకుంటే, ఊరుకునేది కాదు. ఆ అమ్మాయికి శరీరంమీద ఎంతో అభిమానం. ఎప్పుడూ స్నానం చేసి శుభ్రంగా వుండేది. ఒక్క రవ్వ మురికికూడా పనికిరాదు. చంటిపిల్లలయినా సరే బాగా తుడవంది ఎత్తుకోదు. మాయిద్దరికి పెళ్ళిళ్ళయినాయి. రుక్మిణిని రెండో పెళ్ళి ఆయనకిచ్చారు. కాని అట్టే పెద్దవాడు కాడు. ముప్పైయేళ్ళుంటాయి. అత్తవారు చాలా నగలు పెట్టారు. పెళ్లవగానే ఆ పిల్లని బడిమానిపించారు. కాని రుక్మిణి ఎప్పటివలెనే ఆడుకుంటోంది.

రుక్మిణి పెద్దదయినకొద్దీ అందమయినపిల్ల అయింది. అందరూ ఆ అమ్మాయివంకే చూసేవారు. ఒకరోజు పొద్దున్న రుక్మిణి మా వాకిట్లో నుంచుంది. మా బడిపంతులు వొకాయన (ఆయనకి పూర్వం బళ్లో రుక్మిణంటే చాలా యిష్టం) మా అన్నయ్యతో మాట్లాడి బయిటికి వెడుతూ రుక్మిణిని చూసి దగ్గిరికి వొచ్చాడు. "రుక్మిణీ! ఎంత పెరిగినది!" అని బుజంమీద చెయ్యివేశాడు చనువుగా. "నన్ను ముట్టుకోకండి. నాకు బాగుండదు" అంది కోపంతో విదల్చుకుని. నేను పెద్దదాన్ని. నేనన్నా అట్లాఅనను. ఆయన నవ్వి బుగ్గపట్టుకున్నాడు. యేం చేసిందో తెలుసునా! వీపుమీద చుఱ్ఱున అయిదు వేళ్లు తేలేటట్టు కొట్టింది. అతను తెల్లబోయి చూసి, "పిచ్చా! అని వీపు తడుముకొంటో వెళ్ళిపోయినాడు. రుక్మిణికి అంత అభిమానమూ, పౌరుషమూను.

నేనింక రెండు నెల్లకి అత్తవారింటికి వెడతాననగా యేదో జరిగింది. అప్పుడు రుక్మిణికి పదకొండేళ్ళు. ఆ అమ్మాయి పెనిమిటి దీపావళికి వొచ్చి రెండురోజులువుండి వెళ్ళాడు. ఆ రెండు రోజులూ రుక్మిణి మాకు కనపడలేదు. ఆయన వెళ్ళినరోజు మధ్యాహ్నమే వొచ్చింది. అక్కయ్యా, అన్నయ్యా, నేనూ వొకటే హాస్యాలు చేశాము. ఆ అమ్మాయిని. రుక్మిణిని హాస్యం చెయ్యడమంటే చాలా కులాసా మాకు. యెన్నడూ ఉడుక్కోదు. మాటకి మాట చమత్కారంగా బదులు చెపుతుం

ది. ఆఅమ్మాయిమమ్మన్ని అనేమాటలువినడంకోసమే మేమాఅమ్మాయిని అనేవాళ్లము. కాని ఆవాళ యేమీమాట్లాడలేదు. తలతిప్పేశింది. గుడ్లల్లో నీళ్ళుతిరిగి కాటుకలోంచికారి నల్లగాకిందపడ్డాయి. చివాలున లేచి మేముపడుకునేగది పక్కనవుంది. దాంట్లోకి వెళ్ళి తలుపువేసుకుంది. ఒకళ్ళమొహాలు వొకళ్ళంచూసుకున్నాం. రుక్మిణియెన్నడూ యిట్లాచెయ్యలేదు. ఆమొహంలో నవ్వేగాని, యెన్నడన్నా యేడుపుచూశామా! భయంవేశింది. యేదోగొప్పబాధ తటస్థించివుండాలి.

కొంచెంసేపుండి, తలుపుతీసి, నేనొక్కదాన్ని గదిలోకి వెళ్ళాను. చుట్టిపెట్టిన మాపరుపులమీద బోర్లపడి వెక్కివెక్కి యేడుస్తోంది. నేను దగ్గరకూచుంటే, "నన్నుముట్టుకోకు, పో, పో అని చాలాతీవ్రంగాతోసేసింది. యెంత బతిమాలుకున్నా యేమీ చెప్పల్లా. ఊరికేయిటూఅటూ కొట్టుకుంటుంది. జుట్టు పీక్కుంటుంది. ఊపిరిబిగబట్టి, చచ్చిపోయ్యేదానివలె అవుతుంది. నాకుభయమేసి యెవరినన్నా పిలవబోతే, పోనియ్యదు. చాలసేపటితరువాత చివరికి, సద్దుకొని, మొహంకడుక్కుని, తలదువ్వుకుని వెళ్ళిపోయింది. అంతే' ఆనాళ్ళనుంచి, రుక్మిణి నవ్వలేదు, ఆడలేదు. యెవరింటికి వెళ్లలేదు' చంటిపిల్లలనన్నా పలకరించదు. ఊరంతా చిన్నపోయింది. యెవరికీ యేమీతోచలేదు. పిల్లలు ఆటలే మరిచిపోయినారు. కాని యెవరికీ కారణం తెలియదు.

రెండునెల్లయింది. నేను అత్తవారింటికి వెళ్లాను. వెళ్ళిన ఆర్నెల్లకే రుక్మిణినిగురించి విచిత్రమయిన సంగతులు వినడం మొదలుపెట్టాను. మొదటనేను నమ్మలేను. తరవాత రుక్మిణిని బాగాయెరిగినవారు, ప్రేమించినవారు. బంధువులు, అందరూ వొకటేమాట చెపితే నమ్మకయేంచెయ్యను, చాలా ఆశ్చర్యంవేసింది. రుక్మిణి అట్లాంటిదవుతుందని నేన్నడూ అనుకోలేదు. చాలావిచారమయింది

మొదట్లో. తరవాత ఆపనులు నేనేచేసినట్లు సిగ్గేసింది. తరువాత తరవాత తక్కినవిషయాలు వినేటప్పటికి అసహ్యం వేసింది. చివరికి ద్వేషం మొదలుపెట్టింది. ఒకసారి మాపుట్టింటికి వెళ్ళినప్పుడు రుక్మిణి కనపడ్డది. అప్పుడే భర్తయింటి దగ్గిర్నించి వొచ్చేసింది. వూరంతా గలభాగావుంది. గుంపులు గుంపులుకూడి ఆడవాళ్లు ఆ అమ్మాయిసంగతే చెప్పుకొంటున్నారు. ఒకనాటి మధ్యాహ్నం అకాత్తుగా, నేను వాకిట్లో నుంచునుంటే నావేపు వొచ్చింది. యెవరది? రుక్మిణే? యెంతమారిపోయింది! అంతదృఢమైనపిల్లా! సన్నగా వుంది. కళ్ళు గుంటలుపడ్డాయి. యేదో భయంచూపువొచ్చింది కళ్ళల్లోకి. లోకంలో విశ్వాసముపోయి, బతుకుమీదే ఆశపోయిన దానివలె కనపడ్డది. ముసలిదాని మొహంవలె, మొహం, ముడుచుకుపోయింది. వెంట్రుకలు అక్కడక్కడ తెల్లబడ్డాయి. నాదగ్గిరకొచ్చి, చెయ్యిపట్టుకుంది. చప్పున లోపలికెళ్ళి తలుపేసుకున్నాను, తరువాత ఆ అమ్మాయిమాపు తలుచుకుంటే జాలేసింది. విచారపడ్డాను. పాపం, గుండెపగిలినదానివలె కనపడ్డది. నాదగ్గరకెందుకొచ్చిందో? స్నేహంవలనా? కాని ఆ అమ్మాయికి అట్లాకావలసిందే! తనుచేసిన పనులో! ఛీ! దానితో నా మాట్లాడేది! అయినా, మాట్లాడివుంటే నేం? ఆఖరుసారి రుక్మిణిని అదే చూడడం.

ఆ రుక్మిణి గురించి నేను విన్నసంగతులివి. నేను విన్నవేకాదు, లోకమంతా అనుకున్నవే. ఇవి నిజము కాదేమోనని యెవరికీ సందేహం కలగలేదు. ఇవి నిజమని మీకెట్లా తెలుసునని అడగవలసిన అవసరంలేకపోయింది. రుక్మిణిని ప్రేమించినవాళ్ళు, నమ్మినవాళ్ళు, అందరూ యిదేమాట. ఆవూళ్ళోప్లికళ్లారా చూశామని చెప్పినవాళ్ళున్నారు.....ఆ అమ్మాయి భర్త కార్యంచేసుకోడానికివొస్తే, "నాకు కార్య మక్కరలేదు. నాకు ఒక మొగుడు పనికిరాడు. ఈవూళ్ళో, మణి, నా స్నేహితురాలు. దానివలె నాకూ భోగందాన్ని కావాలని

వుంది." అందిట. తనకు ఎక్కువగా డబ్బిస్తేనేగాని, ఆరాత్రి తనని ముట్టుకోవొద్దంది మొగుణ్ణి. అప్రతిష్ఠ అని దానిపెనిమిటి వాళ్ళవూరు తీసికెళ్లాలంటే రానందిట. ఆఖరికి బలవంతంమీద తీసుకెళ్లారు. అక్కడ ఆ అత్తగారూ యిట్లాంటిదేట. అత్తాకోడలూ వొకటైనారు. రుక్మిణి ఎక్కడికో లేచిపోయింది. ఆ పెనిమిటెంతమంచివాడో! దాన్ని మధ్యదోవలో పట్టుకొని, వెనక్కు తీసుకొచ్చాడు. చివరకు విసుగెత్తి ఎట్లాగో తప్పించుకొని వాళ్ళవూరు వొంటరిగా లేచివొచ్చింది. తాతా, తల్లీ, తిట్టారు. వాళ్ళనే తిట్టి, భోగంమణి, యింటికి లేచిపోయి, దానితో కాపరముంది. మహాత్ముడు, యెంతదయో ఆ పెనిమిటికి, మళ్లీవొచ్చి రమ్మంటే, ఆవూరి రౌడీలని పోగుచేసి, తనూ, అదికలిసి, ఆ పెనిమిటిని తన్ననిడాకి సిద్ధమైనారు. అప్పుడు "అయ్యో వృధాగా యిట్లా పాడవుతూందే" అని విధిలేక, పోలీసుకి రిపోర్టు చేశారు. వాళ్లూ నయానా భయానా చెప్పిచూశారు. ఇంక పెనిమిటి దగ్గిరికి పొమ్మని బలవంతం చెయ్యపోతూవుంటే కాలవలోపడి చచ్చింది. ఆ రుక్మిణి యిదంతా చేసింది అని పెద్దవాడుక:—యెంత అక్రమం! ఆపిల్లకి యేదో గ్రహబాధ తటస్థించివుంటుంది. పీళ్ళపాపం ఆపిల్ల స్వబుద్ధితో టే చేసిందనుకున్నారు. ఆ అమ్మాయి చచ్చిపోయిందనివిన్నా, నాకేమీ దిగులెయ్యలేదు.

యిదంతా అయిన నెల్లాళ్లకి ఆవూరు వెళ్ళాను. మా వొదినకు సుస్తీగా, వుంటే కాలవకి నీళ్లకి నేనే వెళ్లాను ఒకరోజు సాయింత్రం. చీకట్లో యెవరో ఆడమనిషి నాచేతులో ఒక కాగితాలకట్ట పెట్టి తొరగా వెళ్ళిపోయింది. యింటికొచ్చి చదవడం మొదలుపెట్టాను. చదువుతోవుంటే నామనసెట్లా అయిందో, దీన్ని చదివితే మీకే తెలుస్తుంది. అవి చచ్చిపోయిన రుక్మిణి వ్రాసింది.

నా పూర్వస్నేహితురాలు, శీతారామమ్మకు:—

నామీద నీకు అమితమైన కోపమని తెలుసు. నాపేరు చెపితే

వుమ్మేస్తావు. మీబోటివాళ్ళ పవిత్రమైన వుమ్మి నా వొంటిమీద పడడానికికూడా వీలులేదు. నాచేత్తో తాకిన యీ కాయితాలు చదువుతావో లేదో! చదవకపోయినా నష్టమేమీలేదులే. అయినా నీకు వ్రాయాలని మనసు పీకుతోంది. చిన్నప్పటి మన స్నేహం నువ్వు మరిచిపోయినా, నేను యెందుకో మరిచిపోలేదు. పతివ్రతలు మీరు. మలినమైన నా పేరును తుడిచేశారు, నిర్మలమైన మీ మనస్సులోనుంచి. కాని మీ ప్రతిష్టగల జీవితాల జ్ఞాపకం మాత్రం, నా అపరిశుభ్రమైన మనసులో వుండిపోయింది. మీ ముఖాలూ, మాటలూ, దయా, నానుంచి తప్పించేశారు గాని, మీ జ్ఞాపకం మాత్రం తీసుకోలేక పోయినారు.

నన్ను గురించి లోకమెట్లా మాట్లాడుతోందో కొంతవరకు తెలుసునాకు. యెటువంటి దుర్మార్గులైనా సరే, మర్యాదగా పైకి తిరిగితే సరి, వారిముందు మనుష్యులు మొహమాటం విడిచి, తోచిందల్లా మాట్లాడరు. కానిపేరూ, ప్రతిష్ఠా, సిగ్గూ, బిడియమూ, పుణ్యమూ, పాపమూ, పాతివ్రత్యమూ, నీతి, వొదిలేశిన, నాముందు, నోటికొచ్చినట్లల్లా మాట్లాడ్డానికి జంకెవరికి? వోడ్డీలకిచ్చి, కొంపలు కూల్చే పెద్దలూ, లంచాలు పుచ్చుకునే పోలీసులూ, కోడళ్లని ఆత్మహత్య చేసుకునేటట్లు చేసిన ముత్తయిదులూ, మొగుళ్ళని మోసపుచ్చే పతివ్రతలూ, అందరూ, నామొహానే తిట్టేవారే! నిజం ఒకరికన్నా తెలియాలని నాకు వుంది. తలుచుకుంటే యిప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. రెండేళ్ళకిందట యెంతమంది నాకు స్నేహితులు, బంధువులు. అందరూ నన్ను పలకరించేవారే, నాస్నేహము కోరేవారే! యీవాళ నన్ను కన్నెత్తి చూసేవారులేరు. ఒక్కరు— ఒక్కరూలేరు. యీబోగంది, సంఘానికి, నీతికి, చెడిపోయిన యీ బోగందితప్పు. యిందరిలో వొకరయినా, "నిజమేమిటి? నువ్వెందుకిట్లాయినావ," ని అడిగినవారు లేరు. యిదీ స్నేహం! జరిగిం

దాన్లో కొంతమట్టుకు నిజం నాభర్తకి తెలుసు, అంతకంటె తెలుసుకోడానికి ఆయనచేతకాదు. పాపం, ఆయన్ని చూస్తే దిగులేస్తుంది.
ఆయనవంటివారు, వేనకువేలుండగా, ఆయనకుమాత్రమే వొచ్చింది, యీకష్టమంతా. నావంటిదాన్ని, అన్నట్టు నావంటి సిగ్గుమాలినకొరివిని, పెళ్ళిచేసుకోవడంవల్ల కాని! ఆయనకు తెలిసిన సంగతులుకూడా నాస్తంగా బయటపెట్టేటంత ధైర్యంలేదు. ఆయన మర్యాదస్తుడు. అట్లాంటి సంగతులు యింకొకరితో మాట్లాడతాడా, అందులో నిజం! మర్యాదస్తులు యెప్పుడూయిట్లాంటివి నిజంచెప్పరు. చెపితే సిగ్గుమాలినవాగని మర్యాదస్తులు బహిష్కారంచేస్తారు.

యీకాగితాలు, నాఆప్తబంధుపురాలు, యీవూళ్ళో ప్రసిద్ధికెక్కిన బోగంది, దానికి యిస్తున్నాను. ఆమెనీకిస్తుంది. ఆమెయిన్యకుండావుండదు, మర్యాదస్తురాలయితేగా, పైకివొకమాట చెప్పి, లోపలయింకొకటి చెయ్యడం!

యీకాగితా లేమర్యాదస్తులకైనా దొరకనీ! యెక్కడ సంఘంపేరు చెడిపోతుందో, యెక్కడబయిటికి రాకూడని సంగతులు వస్తాయో, అనినాతో భద్రంగావుంచమనిచెప్పి, వెనకాలేత గలపెడతారు. వచ్చిపొయ్యే నేను వొచ్చిఅడగనుగా! అన్నట్లు యీమర్యాదస్తులకి స్వర్గంలో నమ్మకంలేదు. మళ్ళీ కలుసుకోమని వారినమ్మకం! అయినా నేను నరకానికి వెడతానయ్యేను వారిది స్వర్గమయ్యేను. వారినడగడానికి వొస్తేనేను, "యీపాడుముండ వొచ్చిందని, నాలుగుగెంట్లు గెంటిస్తారు. యీకాగితాలు చదివికూడా నీకునామీదకోపం పోకపో తేపోకపోవొచ్చు అయినా, చదివిచూడు.

యీరాత్రి యీలోకంలోనుంచి వెళ్ళిపోతున్నాను. నాకు పదహారేళ్ళురాలేదు యింకా. కానియీరేళ్ళ అనుభవం అయిపోయింది. యింకచాలు యీలోకం. యిట్లాంటి దుష్టాత్మురాల్ని యింక యీ

భూమి మొయ్యలేదు. యీ రాత్రి నీళ్లైనా నన్ను స్వీకరిస్తాయో లేదో! నేను చచ్చిపోయినానని తెలియగానే యెందఱో సంతోషిస్తారు. ముఖ్యంగా నాభర్తగారు, వారం రోజుల్లో యింకొక చెప్పిన మాటవినే చక్కని భార్యని తెచ్చుకుంటారు. సందేహంలేదు. నావంటి నీతిబాహ్యురాలుపోతే ఇంకొకదాన్ని నాభర్తగారు పెండ్లాడడంలో వింతలేదు. ఎందఱు పతివ్రతలనుకొన్న పెళ్లాలుచచ్చిపోతే పురుషులు వెంటనే యింకోదాన్ని పెళ్ళాడడంలేదు!

ఇదివరకేనాతో, ఆయనకిపడటంలేదని, వేరేసంబంధాలు వొచ్చాయి, తరవాత మా తాతయ్య, అమ్మ పాపం, నామూలంగా ఆమర్యాదస్తుల కుటుంబానికి యెంతఅవస్థవొచ్చింది. యెట్లానన్నా నేను వాళ్ల బిడ్డనికాననిపించుకోవాలని యత్నించారుగాని, వీలులేకపోయింది. లోకమంతా వారికివొచ్చినఆపదకి వాళ్లనివోదార్చిందిగాని, లోపలవాళ్లకి అనుమానమే, "యిట్లాంటి పిల్లని యెట్లాకన్నారా, అని ఆశ్చర్యంతో వాళ్ళనుకూడా నాతో జతచేస్తున్నారని,, మర్యాదస్తులుకాదూ! మర్యాదస్తులకు మర్యాదస్తులకూ అనుమానం! మొహంముందరస్తుతి, వీపువెనకనవ్వులూ! యిదేగా మర్యాదంటే! "మహాలక్ష్మమ్మగారి కూతురులేచిపోయింది, అనడం తప్పడంలేదుగా! పాపం, మా అమ్మకి యెంతకష్టంవొచ్చింది. యెందుకుకన్నానా, అనుకుంటోంది. చిన్నప్పుడు యిటువంటి బిడ్డయెవరికీ లేదని గర్వపడ్డ రోజులు, నాఆటలు పాటలూ, చూసి, ఆనందబాష్పాలు రాల్చినదినాలు, నన్నువొళ్ళోకూచోపెట్టుకుని, మానాన్నని తలుచుకుని ముద్దుపెట్టుకొన్న సమయాలు, మరిచిపోయింది. తరవాత నాస్నేహితులందరూ సంతోషిస్తారు, నేను పోతే. నాసంగతి యేమిటని యెవరన్నా అడిగితే చెప్పలేక, వారి స్నేహితురాల్ని కానని నిరాకరించలేక విసుగెత్తిపోయింది పాపంవాళ్లకి! "మాకు తెలియదు మునుపుకూడా అట్టే స్నేహంలేదు. ఆఅమ్మాయికీ నాకూ" "యీ పొగరుమోతు

తనంచిన్నప్పుడూ వుండేదమ్మా" "యిన్నాళ్లూ, దాన్ని తిరగనిచ్చాను మనలో," "అప్పుడుమాత్రం, దానికిఅట్లాంటి గుణాలులేవనా!" "మన పిల్లలు నేర్చుకోకముందే పోయిందిలేఅదోనయం." "పోయింది. మంచి పని అయింది. వుంటే మనకి తలెత్తుకు తిరగడానికి వీలుండా!' "ఆహృదయంలో అంతభారం పెట్టుకొని యెన్నాళ్ళు బతుకుతుంది!" యీ మాటలన్నీ అప్పుడే నాకు వినపడుతున్నాయి.

నువ్వు మీఅత్తగారింటికి వెడతావనగా ముందు నేనొకరోజు మీయింట్లో యేడ్చాను చూశావా! అంతకు రెండురోజులముందు నాభర్త మనవూరు వచ్చాడు. అప్పటినుంచి మొదలు నావిచారము, నానరకము, నాబాధ, నామరణము. నమ్ము, నిజంగా, నమ్ము. అంతకుముందు పెళ్ళిఅంటే యేమిటో తెలియదు నాకు. కాని మొగాళ్లుముట్టుకుంటే నాకు కోపం. చాలకోపం. ఆవాళ్ళ మన పంతులేకాదు. యింకా చాలామంది నన్ను పట్టుకునేవాళ్లు. వాళ్లందరినీ కొట్టేదాన్ని. నన్ను వూరికే ముట్టుకోడానికీ, ఆవిధంగా ముట్టుకోడానికీ, యెట్లానో భేదం తెలిసేది. నన్నూ నాశరీరాన్ని అవమానం చేసినట్లుండేది. మాతాతయ్య బావమఱిది నన్ను మొహం యెంగిలి చేసేటట్టు ముద్దు పెట్టుకుంటే, ఆయన్ని మొహమంతా రక్కాను! నా అసహ్యం చూసికూడా మా అమ్మ యేమీ అనేదికాదు. కొంచెం పెద్దదాన్ని అయింతరవాత కూడా నన్ను ముట్టుకోవచ్చేవాడు. నావొళ్ళు కాలేది. యెవరితోనూ చెప్పేదాన్నికాదు. యెంత కష్టంగావున్నా; సిగ్గు చాలా వుండేది. రక్కేదాన్ని. కరిచేదాన్ని, వుమ్మేశాను. అయినా ఆయనకు సిగ్గువుండేదికాదు. ఆఖరికి కష్టపడి అమ్మతో చెప్పాను, కష్టంమీద. నవ్వి వూరుకుంది. నాకెంత ఏడుపొచ్చిందే? పారిపోదామనుకున్నా. ఒక సారి రాత్రి అతన్ని చంపేద్దామనుకున్నా. ముట్టుకున్నచోటల్లా,

పదిసార్లు కడిగేదాన్ని. తరువాత అతను నన్ను అట్టే బాధించడం మానేశాడు. అయినా పూర్తిగా వొదలలేదు.

అన్నిట్లోకీ మాఅమ్మ నవ్వి వూరుకోడంమాత్రం, నన్ను చంపుకున్నట్లుండేది, యేమికష్టంకలిగినా అమ్మతీరుస్తుందని నమ్మకముండేది. మాఅమ్మ యెందుకట్లా వూరుకుందో తెలియదు. మోహమాటమో లేకపోతే నాబాధ అర్థంకాలేదో! అవును, మాఅమ్మకి నన్ను అట్లాచేస్తే సంతోషమేమో! నామీద యీర్ష్యయేమో, నన్ను కన్న దయగల, తల్లి, నేను బాధపడుతున్నానని తెలిసి, వూరుకుంటుందా! యిట్లాంటివియింకా కొన్ని జరిగాయికాని పెళ్ళిఅంటే మాత్రం ఆవాళమధ్యాహ్నందాకా నాకు తెలియదు.

మధ్యాహ్నం రెండుగంటలయింది, మామూలుప్రకారం అమ్మ కాఫీతీసుకెళ్ళి నాభర్తకియ్యమంది యెప్పటివలెనే గదిలోకి తీసికెళ్ళాను. తలుపెయ్యమన్నాడు. నేను కదల్లేదు. లేచి తనే తలుపేశాడు తరవాత యేంజరిగిందో నాకు యేమీతెలీదు, యెందుకో తెలియదు. నావొళ్ళు నాది కాదనిపించింది. ఆఖరికి కొంతసేపటికి తటాలునలేచి, 'పో' అని ఒక తన్నుతన్నాడు. బయిటికివొచ్చిపడ్డా. మళ్ళీ యెప్పటియిల్లు చూసేప్పటికి ప్రాణంలేచివొచ్చింది మనుష్యుల్లో పడ్డానుకదా అని ధైర్యం వొచ్చింది. పెద్దగా యేడుస్తో వెళ్ళి అమ్మని కావలించుకున్నా. చిన్నప్పుడుకూడా యేబాధవొచ్చినా బిగ్గరిగా యేడ్చేదాన్నికాదుట, ఆవాళ యేడ్చాను. అది ఒక్కసారే నోరెత్తి నేనేడ్చింది. అప్పట్నించి యేడవలేదు. యేడుపొస్తే బావుండును రాదు. విచారం గడ్డకట్టింది హృదయంలో. ప్రతి కన్నీటిబొట్టూ గడ్డకట్టింది. యింక యేడవచుకదా! యిదే ఆఖరుసారి యేడుపు యీకాగితాలద్వారా నీతో! మా అత్తా, అమ్మా బిగ్గరిగా నవ్వారు. దయలేదు ఆమొహాల్లో నామీద చెయ్యేసి "యేంచేశాడు? కరిచాడా?" అన్నారు. నన్నేంచేశాడో తెలియకే

యిదంతా! నావాళ్ళు వాశికింది! నేనిట్లా అరవడం, యేడవడం వాళ్ళకి కొత్తగా కనపడలేదుగావును. సీతారామయ్యా! అందరూ యింతేనా? అత్తయ్య తులసికోటనిమైలచేస్తే రాక్షసిలాగు మీదపడి, చక్కనితిట్లు ఆతులసిమంత్రాల నోట్లోంచి తెప్పించేది. కాని అతను మీద అట్లాపడితే ఒక్కతిట్టూ రాలేదు. చక్కని వెకిలినవ్వొచ్చింది? నాకంటె తులిసికోటేనయం! యేం సంతోషం ఆమొహంలో తన కేదో ఆయన వుపకారంచేసినట్లుంది, ఆమెకు. అప్పుడు మీయింటికివొచ్చి యేడ్చిందందుకనే. ఎవరితో చెప్పుకోను! బతుకుమీద అసహ్యం పుట్టింది. ఇంకొకళ్ళ మొహం చూడ్డమంటె సిగ్గేసింది. రాత్రింబగళ్లు అదే తలుపు అదే భయం-నాసంతోషం, లోకమంటె ఆనందం, మనుష్యులంటే నమ్మకం, అన్నీ పోయినాయి.

ఆయన వెళ్ళిపోయినాడు. వెళ్ళినప్పటినించీ, మాఅమ్మకీ, తాతయ్యకీ, వుత్తరాలు. ‹‹ఎన్నాళ్లు ఆగాలి యింకా మీపిల్ల యెందుకు పెద్దమనిషికాలేదు? అప్పుడే పదకొండేళ్ళన్నారే! యింతకాలం పెద్దమనిషి కాదని తెలిస్తే, వేరేసంబంధం అప్పుడే కుదుర్చుకునేవాళ్ళమే?" అని. ఈప్రకారం వారానికన్నా వొక వుత్తరం వొచ్చేది. మూడు నాలుగు నెల్లయిన తరవాత ‹‹పెద్దమనిషి కాకపోయినా, అవుపోసనం చేసి పంపవలిసింది-వొచ్చేనెలలో ముహూర్తాలున్నాయి.'' అని వుత్తరంవొచ్చింది. మాతాతయ్య వొప్పుకోలేదు. దానితో వాళ్లకి చాలాకోపమొచ్చింది. మీపిల్లమాకక్కరలేదు. వేరేసంబంధంవిచారించుకొంటున్నా"మని వ్రాశారు ఆవుత్తరంమీద మాఇంట్లో తాతయ్యకీ అత్తయ్యకీ, అమ్మకీ, తగాదాలూ, యేడుపులవటంకొచ్చింది. అత్తయ్య నన్ను వెంటనే వాళ్ళదగ్గరికి పంపెయ్యమంటుంది. అత్తకి పెనిమిటి యెనిమిదోయేట పోయినాడు. అందుకనేయేమో, నన్నూ నాపెనిమిటినీ వొకచోట వొదలడమన్నా, నన్నత్తవారింటికి పంపడమన్నా, చాలాయిష్టం. కాని తాతయ్య వొప్పుకోలేదు. అమ్మా అత్తా,

పోట్లాడి, యేడ్చారుకూడాను! వాళ్ళు వేరేపెళ్ళిచేసుకుంటే, చేసేదే
మిటి? నాభారం మావాళ్ళమీదవుండిపోతే! మాఅత్తభారం. అమ్మ
భారం, ఆయింటిమీదవుండగాలేనిది, నాదివుంటుందనా, యింత
భయం? యింకయేం చాతగాక మాఅత్త నన్ను తిట్టడం మొదలు
పెట్టింది. నేనేంచేశాను? నాకు తలంటిపోసేటప్పుడు వినరాని మా
టలు అనేది. కాని అతనుయింకో పెళ్ళిచేసుకోని నన్ను వొదిలేస్తా
డని తెలిసి, నాసంతోషానికి మేరలేదు. యెన్నితిట్టినా మావాళ్ళు,
ఆనందం ఆగేదికాదు. సంగీతంపాడుతు తిరిగేదాన్ని. యింక యెప్పటికీ
చిన్నదాన్నిగావుంటేనే బాగుంటుందనుకున్నా. కాని యేమనుకు
న్నాడో యేమో, మాతాతయ్య, నేను పెద్దమనిషినైనానని వుత్త
రం వ్రాశేశాడు. వారంలో ముహూర్తంపెట్టి కార్యానికివొస్తున్నా
మని వ్రాశారు వాళ్ళు. అప్పుడు ముహూర్తంలేదే అని మావాళ్ళా
శ్చర్యపడ్డారు. కాని వాళ్ళేమంటారోఅని వూరుకున్నాను. మాతాత
య్యకికూడా యీగోలంతా చాలావిసుగనిపించిది. అదిగాక యెవ
రో మధ్యవర్తులొచ్చి మాతాతయ్యని బెదిరించి వొప్పించారట

యెట్లానన్నా యీగోలంతా వదలిపోతే చాలుననిపించింది ఆ
యనకి. ఆయనకి వదిలిందిగాని నాకు మొదలుపెట్టే గోలసంగతి
యెవరాలోచించారు? నాకు వొళ్ళు వొణకడం మొదలుపెట్టింది
పెళ్ళంటేయేమిటో తెలిసిపోయిందిగా! రాత్రిలు నిద్రపట్టను, అదే
భయం. అన్నం సరిగా తినలేదు, వాళ్లకేం? నాకూ ఆబాధంతా,
చిన్నపిల్లనినాకూ, యెన్నాళ్లో! అయనో, నేను, చచ్చిపోయిందాకా
తప్పదు గావును? అందరూ యిట్లాంటిబాధసహించే కాపరంచేస్తు
న్నారా? వాళ్ళుయేడుస్తున్నట్లు కనపడదే? మాఅమ్మదగ్గిర యేడ్చాను
"వొద్దు నీదగ్గిరేవుంటాను. ఆయన్నిచూస్తే భయమని. మొదలున
వ్వింది. తరవాత తిట్టింది. చాలాకోపంగా తిట్టింది. చెట్టు మొలవడం
పెద్దదికావడం కావడం కాయడం యెట్లానో, ఆడపిల్లపుట్టడం, పెరగ

డం పెళ్ళికావడం, పెద్దదవడం కాపరం చెయ్యడం మామూలయింది. యేమన్నా యీపనుల కాటంకం వొచ్చినట్లయితే సృష్టికాటంకం వచ్చినట్లే వుంటుంది వాళ్ళకి. అందులో ఆడపిల్లని చిన్నపిల్లని నేను కాపరం పెద్దనడమే యింకేముంది! యినివాటికిట్లా పెద్దన్న వారున్నారా? వుంటే! అట్లాంటివాళ్ళని లోకం మెచ్చుకుంటదా! చెట్టు పువ్వు పుయ్యకపోతే ఆగుతారు. గొడ్డు చూలుకాకపోతే యేంచెయ్యలేరు. నన్ను... నోరుమోసి, బలవంతంచేసి తన్ని...... జ్ఞానమూ, మాటలూ, బాధా, సిగ్గూ, అభిమానమూ, ముందే భయమూవున్న నన్ను స్వతంత్ర్య జీవిని, వీళ్ళవరునన్నట్లా నిర్బంధించడానికి. నన్ను కన్నారు, తిండి పెట్టారు, అందుకని వాళ్ళ వస్తువు నయినాను. వాళ్లమృగాన్ని. నన్నువిడికి అమ్మారు. నన్ను కనమన్నానా? కన్నందుకు తిండిపెట్టారు పోసి పెట్టకుండా చంపక పోయినారా? యింతకంటె బాగావుండిపోయేది. తిండిపెడితే మా త్రము? పశువుకి గడ్డివెయ్యలేదూ? నేనూ అంతేనా! మాఅత్తని తీసి కెళ్లి బలవంతగా యెవరికన్నా ముడిపెడితే! చిన్నదాన్ని, నోరు లేనిదాన్ని, గనక కాదూ వాళ్ళు నన్నిట్లా చేసింది,

పోనీ. తల్లి, తల్లిగా! నామీద అంత అధికారం చేసింది. అప్పటి కయినా, పెళ్ళి అంటే యేమిటో, స్త్రీ ధర్మం ముందు ముందు యెట్లా కష్టంగా వుండవో, అన్ని చెప్పిందా, దగ్గర కూచో పెట్టు కుని? అది తప్పు. అట్లాంటిమాటలు చిన్నపిల్లలతో అనకూడదు. చిన్నపిల్లన్ని అకాత్తుగా గదులలోకి పంపవొచ్చు. ఆఅమ్మ నిర్మల మైన నోట్లోనుంచి, అన్నతిట్లు వొచ్చాయే, యీ మాటలు రాకూ డదూ?

ముహూర్తానికి సరిగావొచ్చారు. నన్ను సాయంత్రం ముస్తాబు చేస్తోవుంటే. బలికి తయారు చేస్తున్న మృగాన్ని లాగుంది. నేను మా అయనకొక యంత్రంగా వున్నాను-పురుషులదృష్టికి స్త్రీ అంతే

కాబోలు! యిన్నాళ్ళూ నేను పెరిగిందీ, భోజనంచేసిందీ, ఆడుకున్నదీ, చదువుకున్నదీ, అంతా, యీయనకిప్పుడు బలికావడానికే. సృష్టిలోవున్న మానవులలో సగంమంది తక్కినసగంమందికి యెందుకిట్లా బానిసలు కావాలో! అందముంటే, మొగవాడను భరించేటందుకు, బలముంటే మొగవాడికి చాకిరి చేసేటందుకు, చదువుకుంటే మొగవాడికి పద్దులు వ్రాసేటందుకు, సంగీతముస్తే మొగవాణ్ణిసంతోష పెట్టేటందుకు, యింతఅన్యాయము లోకమెట్లా భరిస్తోందో! ఆచారమనే బురదలో కుళ్ళిపోయి నశించాయి మనవాళ్ళ హృదయాలు. యీమొగరాక్షసుని సంహరించి యీఅనాధలను కాపాడడానికి యేరాముడూ అవతారమెత్తడూ.

ఒకరాత్రి నాభర్త యుపన్యాసము ప్రారంభించాడు మొదటి పెళ్ళాము చెప్పినట్లల్లా వినేది. ఆమె చనిపోయింతరువాత పెళ్ళిచేసుకోదలుచుకోలేదు. మాఅమ్మ బలవంతం చేసింది. ఆలోచించి, చివరికి నేనుచేసిన తెలివితక్కువ పనిచూడు. యేపల్లెటూరి పిల్లనో చేసుకుంటే, యెంతబావుండిపొయ్యేది. నీచదువుచేసిందిదంతా. చదువుకున్నదంటే అంగడిపద్దూ అదీ వ్రాయడానికి పనికొస్తుందని సంతోషించా. యెంతో తెలివిగలదన్నారు. యెందుకా తెలివి! చివరికిట్లా తేలావు. పతిభక్తినేర్పని చదువు ఆదేంచదువు? సంగీతమొచ్చిందంటే దేవతార్చనదగ్గిర మంగళహారతులుపాడతావని ఆశపడ్డాను యెందుకూఅవన్నీ! నీ అందం మాత్రమెందుకూ? యేంలాభం? యిప్పుడు విచారిస్తున్నా.''
నాఅందంయీయనలాభానికా? ముందుసృష్టిలోనేఅందుకుయేర్పడ్డదా?

మూడురాత్రిళ్ళూ అయినాయి. నన్ను వెంటనే తీసుకెడతామన్నారు. మాఅమ్మదగ్గిరా, తాతయ్యదగ్గిరా, కళ్ళు కాయలుకాసేటట్టు యేడ్చాను, వెళ్ళనని. కాని కొంచెమన్నా కనికరం రాలేదు వాళ్ళకి. నాకు ముల్లుగుచ్చుకుంటే, గిలగిలలాడే, వాళ్ళు. కానియిప్పుడునామీద యెందుకు జాలిపడరు? వాళ్ళంతా జెర్రులుపాకినకంటె బాధే

అసహ్యమే, నామీద దయరాదేం! చిన్నప్పటినుంచీ నేను పెరిగిన యిల్లూ దొడ్లో నేను పెంచిన గన్నేరుమొక్కా, దానిమ్మచెట్టూ, వొదలిపోవడమంటే యెంతో దిగులువేసింది. కాని యెవరితో చెప్పుకోను? అమ్మ శివగంగ వెళ్లినప్పుడు మూడురోజులు పిల్లని యింట్లోవొదిలేసి వుండలేకపోయింది. నాకెంతకష్టంగావుంటుందో ఆలోచించినవాళ్లేలేరు.

అత్తవారియింటికివెళ్ళాను. పెద్దయిలు వాళ్లది. ఆయింట్లో మా అత్తగారుమాత్రముంది యింకెవరూలేరు. ఆమెనన్నెంతో ఆదరించి ప్రేమగా చూసింది. యింట్లోపనిఅంతా ఆమే చేసుకునేది. వంట కూడా ఆమే. నేనేమన్నా పనిముట్టుకుంటే కేకలేసేది. అయన మా వారంటే మీదపడి కేకలేసేవారు. ఆయన అభిప్రాయం నాశక్తి యింక దేనికీ వుపయోగించకూడదని లాగుండేది. పొద్దున్నుంచి సాయింత్రందాకా, మళ్లీ సాయింత్రి నించి పొద్దునదాకా పడుకునివుండడంతప్ప పనిలేదు. ఇంతేనాబతుకంతా. భారతం రామాయణం, భాగవతం పడేశాడు, చదువుకోమని. సాధారణంగా యెప్పుడూ యింట్లోనేవుండేవాడు. కాని నాతో ఆట్టేమాట్లాడేవాడు. కాదు. ఆయనకి యింకేమీతోచేదికాదు. ఆయింట్లో యేమిజరుగుతున్నా నాకుపట్టదు. నేను కృతజ్ఞతా, సంతోషం, ప్రేమా, చూపనందుకు ఆయనకి కోపం విసుకూవొచ్చేవి. ఆయనమీద ప్రేమ యెట్లాచూపాలో, యెందుకుచూపాలో తెలిసేదికాదు. నాస్నేహితుల మీద చూపడం తెలుసు, కాని ఆయనమీద ప్రేమ యెట్లాచూపడం! తిట్టేవాడు. 'మొదటిది యెంతకష్టముగావున్నా యెట్లా చెపితే అట్లావినేది. దొంగ సంతోషమన్నా కనపరిచేది. ఇది మొండి కదా?' అనేవాడు. ఆయన్ని చూస్తేదిగులేసేది. నాభర్త కాకపోతే, ఆయనమీద యిష్టమూ, గౌరవముండేదనుకుంటా. ఆయనస్నేహితులందరూ ఆయన్ని చాలా ప్రేమతో చూసేవారు. వారిమీద ఆయనకి

చాలా ప్రేమ. దయగలవాడు, ధర్మాత్ముడు. యింటికి వచ్చిన బిచ్చగాళ్ళందరూ ఆయన్ని దీవిస్తూ వెళ్లేవారు. ఆయనకి ఆవూళ్ళో చాలా మంచి పేరుంది. నాకేంలాభం? అంత మంచిమనిషీ నాపాలిటికి యముడైనాడు. లోకంలో అందరూ ఆయన మంచితనాన్ని అనుభవించారు. నేనుమాత్రం-నేను-ఆయన అర్ధాంగినీ-ప్రాణనాయికనూ, కాదూ! నేనుమాత్రము అయన దుర్గుణాలనే అనుభవించేవలసి వచ్చింది.

ఒకానాడు నాతో మా అత్తగారు ,,అమ్మాయీ, పోనీ, మీ తాతయ్యని వచ్చి నిన్ను నాలుగు రోజులు తీసికెళ్ళమని వ్రాయి,, అని కార్డిచ్చింది. వ్రాశాను. మా తాతయ్య వొచ్చాడు. ఆయన నన్ను పంపనన్నాడు. అయినాగాని, నన్ను తీసికెళ్లమని మా తాతయ్యని బతిమాలుకున్నా. కాని వినిపించుకోలేదు. ,,తాతయ్యా, నువ్వే యిట్లా నామీద కనికరం చూపించకపోతే, నాకు దిక్కేమిటి?,, అని యేడ్చాను. ఆయన కళ్ళంబడి నీళ్ళు కారాయి. ,,ఒకరిచేతుల్లో పెట్టినతరవాత యింక మా పెత్తన మేమిటి? ఆయన్ని వొప్పించు,, అన్నాడు. నాకోసం మా తాతయ్య ఆయనతో విరోధము పెట్టుకుంటాడా! భోజనంలో మామిడిపళ్లూ, మధ్యాన్నం ఆవడలూ, ఫలహారం, వచ్చినప్పుడల్లా పట్టంచు పంచెల చాపూ నాకోసం పోగొట్టుకుంటాడా! నాకు తెలియకుండా వెళ్ళిపోయినాడు.

నాకూ పెనిమిటికీ పోట్లాటలు యెక్కువయినాయి. ఆయనమీద దొంగప్రేమ చూపాను కొన్నాళ్లు, యెట్లానన్నా ఆయన్ని సంతోషపెట్టి సుఖపడదామని అందరు పతివ్రతలూ యెట్లావుంటారో అట్లా ఉండాలని అనుకరించాను. నా స్వభావాన్ని చంపుకుని, ఆయన ఛాయను కావాలని చూశాను. దొంగపనులు, నీచమయిన పనులుచేశాను. కాని నన్ను చూస్తేనాకు పరమఅసహ్య మయింది. దొంగతనం నా స్వభావంలో లేదు. నన్నూ, నాశరీరాన్ని నాస్వభా

వాన్ని కోతచేసినట్లుంది. అంతా ఓర్చుకుని నాశరీరం యిచ్చేస్తే చాలదట. సంతోషంగా కనపడి, తనమీద మోహంచూపి...... ఛా, తలుచుకుంటే యీ శరీరాన్ని తగలపెట్టాలనిబుద్ధిపుడుతోంది. నీళ్లల్లో పడి తేచాలదు. నిప్పుతో శుద్ధిచెయ్యాలి. అట్లాంటిపనులు చెయ్యమనేవాడు.

వారంరోజుల తరువాత యేదో బాధ మొదలు పెట్టింది. డాక్టరుని పిలవలేదు. చాలా జబ్బుచేసింది. మంచం వదలలేదు. ఆఖరికి డాక్టరు వచ్చిచూశాడు. ‹‹నాకు తెలియదు ఆడడాక్టరుని పిలవమ"న్నాడు. ఆవూళ్ళోమిషనరీ లేడీడాక్టరునిపిలిచారు. ఆమె ఆమొగడాక్టరూ కలిసిమాట్లాడుకొని నాపెనిమిటితో యింగ్లీషులో కఠినంగా మాట్లాడారు. ఆయన మీకెందుకన్నట్లుగా జవాబు చెప్పాడు. ‹‹మైవైఫ్! మైవైఫ్!,, అనిచాలాసార్లుఅన్నాడు. నాకెన్నేళ్ళుఅనిఅడిగారు. ‹‹పోలీసు. మేస్ట్రీటు,, అనికూడాఅన్నారు. నాభర్తవాళ్ళని బయటికి నడవమన్నాడు. అటుతరవాత ఆడాక్టర్లని పిలవలా. తెలుగుమందులు మొదట వాడారు. మూర్ఛలు మొదలుపెట్టాయి చాలాబాధపడ్డాను. మూర్ఛవంక పెట్టి భరించలేక, తన్ని, రక్కి, గంతులు వేశేదాన్ని, మళ్ళీ మాతాతయ్య వచ్చాడు. అయినాపంపలా. ఆయనవెళ్ళిపోయినాడు.

ఎట్లానోకొంచెం నెమ్మదించింది. ఇంక ఆయింట్లో వుండకూడదని నిశ్చయించుకొన్నా ఒక్కనిముషము సౌఖ్యమనుభవించేలేదు. బాధా, అసహ్యమూ, భరించే సలవికావటంలేదు. ధైర్యంచేసి ఒకరోజురాత్రి ఆయనతో మాట్లాడాను. ఆయనతో కాపరం నాకిష్టంలేదని, చాలా కష్టంగావుందనీ, మాయింటికి వెడతాననీ, యింకరాననీ, ఆయన యింకోపెళ్ళి చేసుకోవొచ్చనీ, ఆయన యిచ్చిన నగలూ, చీరెలూ, అన్నీ యిచ్చేస్తాననీ, యీకాస్త వుపకారం నాకుచేస్తే ఆజన్మాంతమూ నేను కృతజ్ఞురాలనై వుంటాననీ, అన్నాను. ఆయన వొప్పుకో

లేదు. నాకువొచ్చే నష్టాలసంగతి చెప్పాడు. ఇప్పుడు యిట్లావున్నా, తరవాత భర్తలేకుండా బతకడంకష్టమనీ, నాకునలుగురిలో మర్యాద యేమీవుండదనీ, మొగుడు వొదిలేసిన ఆడదంటారనీ, మావాళ్లుకూడా సరిగాచూడరనీ అన్నాడు. అన్నీ భరిస్తానన్నాను. నేను పెద్దదాన్నైతే నీతిచెడి పోతానన్నాడు. పోనీఅన్నాను. అప్పుడు తన కపరిపిష్ట. వేరేపెళ్లికాదు. మళ్ళీఖర్చు, అన్నాడు. అయితే నాకేమన్నాను. వీల్లేదన్నాడు. వీల్లేదట, నావొళ్ళుమండింది. యేంనేరంచేశానని ఈ కయిదు! యిది సంసారంకాదూ? కయిదా? యెట్లాంటి నేరంచేసినా యెప్పటికో అప్పటికి విడదలవుతుంది. యీ వివాహంనేరం, మాతాతయ్యావాళ్ళూ నాకుచేసినందుకు, ఆజన్మాంతమూ విడదలలేదు. నేను పారిపోతానన్నాను. నేను నిజంగాపారిపోవాలని చూస్తున్నాననీ, తాను అడ్డపెట్టలేడనీ, వేళాకోళం కాదనీ నచ్చచెప్పాను. మళ్లీ పట్టి తీసుకొస్తానన్నాడు. సరే, ముందుపారిపోతానన్నాను తలకెక్కింది. వెంటనేయేడ్చాడు. యేడ్చిఅప్పుడు నిజంచెప్పాడు. "నువ్వుపారిపోతే నాప్రతిష్ట యేమవుతుంది? మొదటిదాని చావునిగురించే అనుమానాలున్నాయి, నువ్విట్లాపారిపోతే యింక యేమని తలెత్తుకు తిరగను? పెళ్లాంలేచిపోయిన మొగాణ్ణిచూస్తే గౌరవం యెవరికుంటుంది? ఆపని చెయ్యకు. నీకేంతక్కువచేస్తున్నా? నిన్ను నేపెడుతున్న బాధయేముంది?" అన్నాడు. నాకసహ్యం వేసిన్నూరుకున్నా.

ఆయింట్లో వొక ముసలిచాకలి వున్నాడు, వాడుయెన్నో యేళ్లనించి వాళ్ళింటోనేవున్నాడట. వాడంతకుముందు నాతో వొక మాట మాట్లాటలేదు. ఒకరోజుమధ్యాన్నం నేనువంటరిగా వున్నప్పుడుతనే నాతో మాట్లాడాడు. నన్ను పుట్టినింటికి వెళ్ళమని, అక్కడవుంటే చచ్చి పోతాననీ, మొదటి ఆమెకూడా యిట్లానేపోయిందనీఅన్నాడు. తాను సహాయంచేస్తానన్నాడు. అంతారహస్యంగా జరిగింది. మర్నాడు మధ్యాన్నానికి మావూరు చేరుకున్నాను. మావాళ్లు నన్ను చూచి

చాలా సంతోషించారు. మా తాతయ్య కావిలించుకొన్నాడు. మా అమ్మ యేడ్చింది. సుబ్బి, అయిల్లూ వాళ్ళ మొహాలూ చూసేటప్పటికి నాప్రాణం లేచివచ్చింది. నా కష్టాలు మరిచిపోయినా. లోకంలో సౌఖ్యముందికదా. నాకు యింకా అనిపించింది. యెందుకు వీళ్లని వదిలి వెళ్ళానాఅని ఆశ్చర్యం వేసింది. దొడ్లో నాగన్నేరుచెట్టు పూలు పూస్తోంది. దూడ పాలిస్తోంది. అన్నీ నావి అట్లానేవున్నాయి పాపం మాఅమ్మమీదా, అత్తమీదా వృధాగా యెంత కోపంగా వుండేదాన్ని!! అనుకున్నా.

అన్ని ఆశలూ బూడిదయినాయి. మర్నాడు ఆయన పరిగెత్తుకు వచ్చాడు. నేను చెప్పకుండా వొచ్చినట్లు మావాళ్లకి తెలిసింది. మా తాతయ్య మొహంతిప్పేశాడు. అత్తయింక తిట్లు చెప్పనక్కరలేదు. అమ్మ నాకడుపు చెడపుట్టావే. చిన్నప్పుడా విషజ్వరంతో చావనన్నా చచ్చావుకావం,, ది. ఆయన రమ్మన్నాడు. ముందు చచ్చిపోతాగాని, రానన్నాను. చాలా తగాదా జరిగింది. వూరంతా గోల అయింది. యేమైనా వెళ్ళకూడదని నిశ్చయించుకున్నా. రాత్రిలు యింక ఆయనతో యేం చెప్పను? ఆక్షేపం, ఆశనీ, దౌర్జన్యమూ? మా తాతయ్య నన్ను తన్నడానికి సిద్ధమయినాడు. తాతయ్యా! నీకెందుకు అంతకోపం నామీద? నేనేంచేశానునిన్ను? నీకేంకష్టమొచ్చింది? నీకప్రతిష్ట! కచేరిలో లంచాలు తెచ్చేవాడివే, ఆర్ధాత్రి దొరకాళ్ళమీద పడ్డావే, ఆదొర తిట్టినతిట్లు భరించావే, నేను రావడం నీకు నామోషీ అయిందా? దేవతార్చన చెయ్యకుండా భోజనం చెయ్యవే, ఆ దేవుడు యేమనుకొంటాడో అని ఆలోచించావా? నీపొరుగునవున్న సుబ్రహ్మణ్యంగారేమంటారో అనుకున్నావుగాని! పతివ్రతతనంట! భార్యకి భర్తతప్ప గతి లేదుట! పుస్తకాల్లో వ్రాసిన నీతులు తప్ప నీబుద్ధితో ఆలోచించావా? దొరకాళ్ళమీద పడడం మంచిదని యే భారతంలో వ్రాసివుంది?

తాతయ్యా! అది హిందూపురుషధర్మమేనా? నేను పోతున్నాను. నా అపకీర్తి యింక నీకుండదు. యిప్పుడన్నా నాకోసం ఒక్క కన్నీరు బొట్టు వొస్తుందా? యిప్పటికీ నాకు కావలసిన శాస్తి అయింది అనుకుంటావా? నీదేమున్నా తప్పుందని యిప్పుడన్నా తోస్తుందా?...............

ఇంక అక్కడ నిలవడం అశక్యమయింది. నాకు తిండికూడా సరిగా పెట్టడంమానేశారు. నాకు చాలా అవమానంవేసింది. చచ్చిపోదామనుకున్నాను. ఇంకగతిలేని ఆడదానికి దిక్కేముంది? ఆరాత్రి బయలుదేరాను. కాలవదగ్గిరికి వెళ్లేటప్పటికి భయమేసింది. నల్లగా చల్లగా నీళ్ళు కనపడ్డాయి. వెచ్చని ప్రాణాన్ని దాంట్లో పోగొట్టుకో బుద్ధయ్యాలేదు. ఇంటికెళ్లడానికి యిష్టంలేదు. కాలవలోచావడానికి ధైర్యం లేదు. ఏడుస్తోకూచున్నా. అట్లా యేడుస్తోనే వూళ్ళోకివొచ్చాను. మనవూళ్ళో బోగంది, నాగమణి అట్లావెడుతూ నాతో మాట్లాడింది. నాసంగతి ఆమె ఇదివరకే వూహించింది. నామీద యేమీ కోపం లేకుండా మాట్లాడింది. దేవుడు పంపిన దూతవలె కనపడ్డది. తనతో వొచ్చి వుండమంది. వెళ్లాను. నాలుగు రోజులు యెంతో సంతోషంగా గడిపాను. అంతదయ నాకెవరూ చూపించలా. ఆమె పాదాలమీదపడి కళ్లనద్దుకోవాలనిపించింది. ఆఖరికి నన్ను వెతికి కనుక్కున్నాడు. వొచ్చారు-నా పెనిమిటీ, తాతయ్యా! మణి నన్ను కనపరచలా. మణి స్నేహితులు మొగవాళ్ళెవరెవరో వున్నారు. వాళ్ళందరూ దూకుడుచేసి తాతయ్యా వాళ్ళనీ లోపలికన్నా రానీలేదు. మళ్లీ సౌఖ్యంగావున్నాను ఆయింట్లోనే. వారంరోజులయిన తరువాత నలుగురు పోలీసువాళ్ళు వొచ్చారు, నన్ను తీసికెళ్ళడానికి. మణి పాపం యేడ్చింది నన్ను చూసి “మాకులంలోనన్నా యెందుకుపుట్టావు కావమ్మా! యీ బానిసత్వం వుండేదికా” దంది. నాపెనిమిటినే, వెళ్ళి ఆమణిని నన్ను వుపయోగించినట్లు వుపయోగిం

చేమను, పూరుకుంటుందేమో! వాళ్ళని మనం హీనంగా చూసి మనయిళ్లకిరానీము వాళ్ళు మనని హీనంగా చూడవలసింది. మనము వాళ్ళమా? నన్ను పోలీసు యిన్‌స్పెక్టరు గారింటికి తీసికెళ్ళారు. పాపం, మణికూడా వెంటవొచ్చింది. అక్కడ తాతయ్య, పెనిమిటీవున్నారు. అందరూకలిసి మణిని చెడతిట్టారు. మణిబాగాబుద్ధిచెప్పింది. కాని వాళ్లచెవులకెక్కుతాయా, ఆమాటలు? ఆయిన్‌స్పెక్టరు, నన్ను నాభర్తతో వెళ్ళమన్నారు. ఆయననన్ను తాకననివాగ్దానం చేస్తే వెడతానన్నాను, లేకపోతే యేమైనా వెళ్లనన్నా. ,,అయితే నువ్వెందుకు పెళ్ళిచేసుకున్నావ"న్నాడు ఆయిన్‌స్పెక్టరు. నేనుకాదు. వాళ్లుచేశారు. అదిగాక అప్పుడు పెళ్ళంటే యీఘోరమని నాకుతెలియదు. నాకెవరూ చెప్పలేదన్నాను. ,,అదంతామాకు తెలియదు. ఆయనభార్య అయినతరవాత నువ్వుఆయన దగ్గిరవుండాలి, ఆయన యేంచేసినాసరే" అన్నాడు. నాకుపెద్దయేడుపు వొచ్చింది, ఆయనకి తెలిసిందల్లా నన్ను ఆడదాన్ని, వొంటరిదాన్ని భర్తచేతికి వొప్పచెప్పడమే! నావొళ్లునాదికాదూ? నన్నుముట్టుకోకూడదని యింకొకరిని నేననకూడదూ? బోగంది అంటుందే స్వేచ్ఛగాఆమాట! పవిత్రంగా అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకొన్న నేననకూడదు? పూర్వం బానిసలుగా అమ్మేవాళ్ళే అప్పుడుకూడా వాళ్ళశరీరాలమీదయింతఅధికారం వుండేదా యాజమానులకి? పుండుపడ్డ యెద్దులని బళ్ళకుకట్టి బాధపెడితే, పోలీసులుపట్టుకుంటారు. కాని భార్యభర్తవద్దయిట్లానరక బాధపడకపోతే, కాళ్ళూచేతులూకట్టి భర్తముందు ,,నీయిష్టంవొచ్చినట్లు చేసుకోను,,ని పారేస్తారు. నాగరికత గలదేశమంట!

ఆయనతో పంపారు. మళ్ళీఅయింట్లో తయారుమేము, మాఅత్తగారేమీ అనలేదు, అంత ప్రేమగాచూస్తుంది. కానిపూర్వంకంటె బాధలెక్కువఅయినాయి. పూర్వంఆయనకుదయలేకపోయినా అందరూ అనుకునే ప్రేమగావునువుండేది. యిప్పుడుఅదేమిలేదు. వెక్కిరిం

పులూ, తిట్లూ, మామూలయినాయి. నాకు బతకవలసిన అవసరం పట్టలేదు. ఆయన బతికివున్నన్నాళ్ళు నేనొక్కరోజు సౌఖ్యపడను, పాపం, ఆయన పోవడంమెందుకు? నేనేపోతాను. మళ్ళీపెళ్ళిచేసుకుంటారు. అపరిదిష్టవుండదు. అన్నీతీరిపోతాయి. మాఅమ్మకీ, తాతయ్యకీ నామూలాన పేరు చెడిపోదు. యింకఅందరూ తలఎత్తుకుతిరగవొచ్చు. ఈరాత్రినీళ్ళు చూసి భయపడను. యీకాగితాల్లో నా సంగతం తా వ్రాసిపెట్టాను.

మనస్థితియిదీ. నీభర్తతో నువ్వు సుఖంగా వున్నావనుకుంటా. కాని నాకు లోకంమీద నమ్మకంపోయింది. నామీద మనవూళ్లో అందరు ప్రేమగా వుండేవాళ్లే, ఒక్కరు నాతో మంచిమాట మాట్లాడినవాళ్ళులేరు. నిజమేమిటని అడిగినవాళ్లులేరు. ముందే నిశ్చయం వాళ్లకి యే సంసారంలో తప్పులున్నా ఆడదానిదేనని. నువ్వెన్నా నాతో మాట్లాడతావనుకున్నా: ఆ మధ్యాన్నంతో ఆ ఆశ కూడా పోయింది: నీతప్పేముంది? యిట్లాంటి అపవిత్రురాలితో మీ పవిత్రమయిన జీవనాన్ని మలినం చేసుకుంటారా? తరవాత, యెంతకష్టం? భర్త యేమంటాడో? నాపేరు వుచ్చరించి యెందుకు పాడుచేసుకోవాలి మీపుణ్యవాక్కులను? సంఘమంతా కలసి భర్తనిచ్చినతరవాత, ఆభర్త చెడ్డవాడంటే సంఘం వూరుకుంటుందా? నువ్వే చెడ్డదానివంటుంది? యెంత గొప్పది స్త్రీ! యెంత వోపికగలది భార్య! యేబాధపడ్డా వోర్చుకోవాలి, భరించేది భార్య. అట్లాంటిది సిగ్గులేక యిలా చెప్పుకొంటుందా. వీధిలోకొచ్చి!

నాకెవరిమీదా ప్రేమలేదు, మణిమీద తప్ప. ఆమాట అంటే నా నాలుక కాలుస్తారు. భర్తమీద ప్రేమలేదుట! ఆమాట అసహమే! పెళ్ళి కావడంతోటే, అకస్మాత్తుగా, అవ్యాజంగా, వొచ్చెయ్యాలి, ప్రేమ; రాకపోతే, రాకపోయినా వొచ్చినట్లు నటించకపోతే, సంఘం వొప్పుకోదు. చచ్చిపోయిన నాదేహాన్ని ఆయనకి

వొప్పచెప్పరుకదా! నాశరీరం నాదికాదుగా! దేవుడిదనన్నా వొప్పుకుంటారోలేదో! నన్నెక్కడ మళ్లీపట్టుకుంటాడో! స్వర్గంలోనా? నాకుస్వర్గమేమిటి? ఆయనకి స్వర్గమే:—నరకంలోకిపోతే, ఈయన్ని తప్పించుకుంటా! తరవాత యేమన్నా కానీ, యీనరకంకంటే ఘోరమయింది యింకవుండదు. అశుభ్రమైన నీళ్లు నావొంటినంతా కడిగేస్తాయేమో! నావొంటికి అంటిన అసహ్యాము. నేనుచేసిన దొంగపనులు, నీచమైన పనులు, ఆయన్ని సంతోష పెట్టాలని చేసిన పాడు పనులు, కడిగేస్తాయేమో! గోదావరినీళ్ళు పాపాల్ని కూడా కడిగేస్తాయంటారు. అట్లా అయితే స్వర్గమొస్తుందిగావును! వొద్దు, వొద్దు. ఎన్నటికీ స్వర్గమొద్దు. ఆయనపాలిని పడతాను, మళ్ళీ. ఎన్నటికీ, యేజన్మానికీ, నాకుభర్త వొద్దు. జన్మజన్మాలకీ బ్రహ్మచారిణి నయ్యేటట్లు కటాక్షించు యీశ్వరా! యిదే నాప్రార్థన.

ఈ కాగితాలు చాకలికిస్తున్నాను. అతను మణికిస్తాడు. ఆమెనీకిస్తుంది. శలవు రుక్మిణి.